క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న కళాకారులు

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన డప్పు స్వామి అనే కళాకారుని భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న ఇండస్ట్రీ ఆఫ్ తెలంగాణ ఫోక్ కళాకారుల ఆధ్వర్యంలో రూ.25 వేలు అందించినట్లు రాయికల్‌కు చెందిన భూక్య గంగాధర్‌నాయక్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

మేడిపెల్లి: భీమారం మండలం పసునూరు గ్రామానికి చెందిన పానుగంటి గంగారాంకు రూ.32వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం గోవిందారం ఎంపీటీసీ పూర్ణిమ అందజేశారు. ప్రభాకర్, రమేశ్ నాయక్, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


ఉత్సవమూర్తుల ఊరేగింపు

రాయికల్: మండలంలోని సింగరావుపేట గ్రామంలో దాసాంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ, ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు మంగోలి చిట్టిపంతులు ఆధ్వర్యంలో శిఖర కలశం, గణపతి పూజ, ధ్వజస్తంభ గ్రామ ప్రతిష్ఠాపన, రక్షాబంధనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రాంచందర్‌రావు, ఉపసర్పంచ్ భీమన్న పాల్గొన్నారు.

తైబజార్ వేలం నిలిపివేయాలి

కోరుట్ల: పట్టణంలో తైబజార్ వేలం నిలిపివేయాలని ఎన్ఎఫ్ నేషనల్ హాకర్ ఫెడరేషన్ అధ్యక్షుడు షాహెద్ మహమ్మద్ షేక్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట వీధి వ్యాపారులతో నిరసన తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చట్టవిరుద్ధమైన తైబజార్ వేలం నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు వీధి వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

బహుజనులు ఏకం కావాలి


మాట్లాడుతున్న సమ్మయ్య

పెగడపల్లి: రాజ్యాధికారం కోసం బహుజనులంతా ఏకం కావాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం కాన్షీరామ్ జయంతి నిర్వహించారు. అనంతరం ధర్మపురి నియోజకవర్గ స్థాయి బీఎస్పీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప దళిత వర్గ సంక్షేమానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, కన్వీనర్ వెంకటేశ్, ఐదు మండలాల అధ్యక్షులు గంగాధర్, బచ్చల స్వామి, గజ్జల స్వామి, తిరుపతి, ప్రశాంత్, మహిళా అధ్యక్షురాలు షామిన్ బేగం, నాయకులు అనిల్, అజయ్, శంకర్, బాబు, మల్లేశం, రవి, నరేశ్, సైదులు, విజయ్, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత


సామగ్రి అందిస్తున్న సభ్యులు

రాయికల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రోషిణి నిరుపేద వధువు వివాహానికి బుధవారం ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు రూ.10వేల విలువగల వివాహ సామగ్రి అందజేశారు. కడకుంట్ల జగదీశ్వర్, చింతకుంట సాయికుమార్, సయ్యద్ రసూల్, విజయ్, గంట్యాల ప్రవీణ్, కిరణ్‌రావు, దిలీప్, రాజు, రషీద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరం భయం

- ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- దోమల బెడద తీవ్రంగా ఉందంటున్న ప్రజలు
- అవి వైరల్ జ్వరాలే అంటున్న వైద్యులు
- ప్రభుత్వ వైద్యం అందించాలని పల్లెవాసుల వేడుకోలు


కథలాపూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితుడు

కథలాపూర్: ప్రజారోగ్యం, పారిశుధ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా.. పలు గ్రామాల్లో సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఫలితంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో వారంరోజులుగా పలువురు జ్వరాలతో బాధపడుతుండటం.. వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే చికిత్స తీసుకోవడం ఇందుకు నిదర్శనమని ప్రజలు పేర్కొంటున్నారు.

దోమల బెడద.. పారిశుధ్య లోపం

ప్రజలు అనారోగ్యానికి గురికావడానికి దోమల బెడద, పారిశుధ్య లోపమే కారణమని తెలిసినప్పటికీ అధికారులు దృష్టిసారించకపోవడం దారుణమని ఆయా గ్రామస్తులు మండిపడుతున్నారు. మండలంలోని గంభీర్‌పూర్, కథలాపూర్, సిరికొండ, చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్నవారు స్థానికంగా ఆర్ఎంపీ వైద్యులతో చికిత్స చేయించుకుంటే నయం కాకపోవడంతో కోరుట్ల, కథలాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. జ్వరపీడితులు కోరుట్ల, కథలాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి రూ.వేలు వెచ్చించారని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. జ్వర పీడితులకు ప్రభుత్వ వైద్యం సకాలంలో అందితే పేద ప్రజలకు ఆర్థికభారం తప్పినట్లవుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జ్వరంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తాం



గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తాం. ప్రజలు మురికి నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలి. పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ సిబ్బంది అన్ని వాడల్లో పర్యటించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిసారించేలా చూస్తాం.

– జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్

రూ.15వేలు ఖర్చయింది



జ్వరం వచ్చిందని కథలాపూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లా. మందులు వాడినా నయంకాలేదు. ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన. రూ.15వేలు ఖర్చు అయింది. ప్రభుత్వం ద్వారా మంచి వైద్యం అందే పరిస్థితి రావాలి. పేద ప్రజలకు ఆర్థికభారం తప్పుతుంది.

– చిలుక దేవుడు, కథలాపూర్

ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స



వారంరోజుల క్రితం జ్వరం వచ్చింది. గ్రామంలో ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నా.. నయం కాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. చికిత్స కోసం కథలాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఖర్చు ఎక్కువ అయినప్పటికీ జ్వరం కాస్త తక్కువ అయ్యింది.

– నేతికుంట వెంకటేశ్, గంభీర్‌పూర్

వైరల్ జ్వరాలే అధికం



వాతావరణంలో మార్పు, దోమల బెడదతో ప్రజలకు జ్వరాలు వస్తున్నాయి. అవి వైరల్ జ్వరాలే. ప్రజలు శుభ్రత పాటించాలి. బయట ఆహారపదార్థాలు తినొద్దు. జ్వరంతో బాధపడేవారు గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రంలో, కథలాపూర్ పీహెచ్‌సీలో సంప్రదించి వైద్యం పొందవచ్చు.

– సింధూజ, వైద్యాధికారి, కథలాపూర్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


కథలాపూర్: తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు


మల్యాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


సారంగాపూర్: బీర్‌పూర్ జూనియర్ కళాశాల వద్ద


ధర్మపురి: పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు


ఇబ్రహీంపట్నం: జూనియర్ కళాశాల వద్ద..

కథలాపూర్: కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో బుధవారం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రంలో ఫస్టియర్ విద్యార్థులు 315 మందికి 303 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్లు పరీక్షల అధికారి గౌసూర్ రహమాన్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో 282 మంది విద్యార్థులకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు.

మల్యాలలో 10మంది గైర్హాజరు

మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో 422 మంది విద్యార్థులకు 412 మంది పరీక్ష రాశారు. కాగా 10 మంది గైర్హాజరయ్యారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: బీర్‌పూర్ కళాశాలలో 149 మంది విద్యార్థులకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. సారంగాపూర్ జూనియర్ కళాశాలలో 84 మంది విద్యార్థులకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

ధర్మపురిలో..

ధర్మపురి : ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 341 మందికి 15 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజా శ్రీనివాస్ పేర్కొన్నారు.

సాగునీటి కష్టాలు పట్టించుకునేదెవరు?


చెత్తను తొలగిస్తున్న ఉపసర్పంచ్ తిరుపతి, రైతు సమన్వయ సమితి సభ్యుడు మల్లేశం

గొల్లపల్లి: మండలంలోని ఎస్సారెస్పీ అధికారుల తీరుతో రైతులకు సాగునీటి తిప్పలు తప్పడం లేదు. కాలువ వెంబడి ఉన్న కింది రైతులకు సాగు నీరు అందించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాలు, వెల్గటూర్ మండలంలోని గ్రామాలకు డీ–53 కాలువ దారా ఎస్సారెస్పీ సాగునీరు అందుతుంది. అయితే ఈ కాలువ పూడికతో నిండిపోయింది. దీంతో ఆ ప్రాంత రైతులు సాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నరు. ఈ కాలువ వెంబడి సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని రైతులు వాపోతున్నారు. ఎస్సారెస్పీ ఏడీ నారాయణ రెడ్డికి విన్నవిస్తే తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని లొత్తునూర్ ఉప సర్పంచ్ చిరుత తిరుపతి, వెంకపూర్ రైతు సమన్వయ సమితి సభ్యుడు నల్లూరి మల్లేశం ఆరోపించారు. మరో రెండు రోజులు నీటిని పొడిగించాలని వారు కోరారు. కాగా బుధవారం కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిత్యం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వచ్చిన వారి సమస్యలను స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణ ప్రజలు క్యాంప్ ఆఫీస్‌కు రాగా వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

✦నేటి నుంచి మార్కెట్ యార్డుకు సెలవులు

మెట్‌పల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం నుంచి మూడురోజుల పాటు సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి కార్యదర్శి రమణ తెలిపారు. కాగా సోమవారం నుంచి కార్యకలాపాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

✦కాన్షీరాం జయంతి

మెట్‌పల్లి: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరాం జయంతి పట్టణంలో బుధవారం బీఎస్పీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి పాల్గొన్నారు.

✦సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ శివారుల్లోని గుట్ట రాజేశ్వరస్వామి ఆలయానికి బుధవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, మండల కోఆప్షన్ సభ్యురాలు ఎండీ.బీబా, ఉపసర్పంచ్ పూడూరి రమేశ్, గుట్ట రాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, వార్డు సభ్యులు ఆడెపు సరోజన పాల్గొన్నారు.

✦నేడు దివ్యాంగ అభ్యర్థులకు ఇంటర్వ్యూ

పెగడపల్లి: డిజేబుల్ లోన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ అభ్యర్థులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

✦అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక

కొడిమ్యాల: మండలంలోని నల్లగొండ అంబేడ్కర్ సంఘం కార్యవర్గాన్ని బుధవారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లెపల్లి రమేశ్‌చంద్ర, ఉపాధ్యక్షుడిగా కొత్తూరి మధుకర్, ప్రధాన కార్యదర్శిగా కొలపురి జగన్, కోశాధికారిగా గజ్జెల నవీన్, సలహాదారుగా సామల్ల గంగయ్య, గౌరవ అధ్యక్షుడిగా కన్నం వెంకయ్య ఎన్నికయ్యారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు భరోసా


ఆయుష్మాన్ భారత్ నమోదులో నాయకులు

జగిత్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పేదల ఆరోగ్య సంరక్షణకు భరోసా కల్పిస్తుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5లక్షల విలువైన వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా ఉచిత వైద్యం పొందవచ్చని వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, చీటి చంద్రశేఖర్‌రావు, మాడిశెట్టి మల్లేశం, నల్ల నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్, బిట్టు, సురేశ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మురుగు తొలగింపుపై నిర్లక్ష్యం

మెట్‌పల్లి: పట్టణంలోని 12వ వార్డులో జియో స్టోర్ వెనుక ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు ఇది. కొన్ని నెలల క్రితం ఆ స్థలంలో వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం అది మురుగు గుంటను తలిపిస్తోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ ప్రదేశంలో కొత్తగా డ్రైనేజీ నిర్మించారు. మురుగు నీటిని అందులోకి మళ్లించే అవకాశమున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : రత్నాకర్, శానిటేషన్ ఇన్‌చార్జి
ఫోన్ నంబర్: 79950 14919

వైభవంగా ఎల్లమ్మ బోనాలు


బోనమెత్తిన చైర్‌పర్సన్ అన్నం లావణ్య


తాటిచెట్టుపై గీతకార్మికుల విన్యాసం

కోరుట్ల: పట్టణంలోని ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ఠాపన సందర్భంగా బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య బోనమెత్తి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గీత కార్మికులు తాటిచెట్ల పైకి ఎక్కి చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఎల్లమ్మ దేవత ప్రతిష్ఠాపన పూజలు చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, గౌడ సంఘం నాయకులు అన్నం అనిల్, బర్ల ప్రభాకర్, మద్దుల గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం

కోరుట్ల: కోరుట్ల ఐఎంఏ ఆధ్వర్యంలో బుధవారం 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు 6నెలల కోసం పౌష్టికాహారం పంపిణీకి కోరుట్ల ఐఎంఏ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాసులు, ఐఎంఏ నాయకులు డాక్టర్ అనూప్‌రావు, డాక్టర్ రేగొండ రాజేశ్, వైద్యులు ఒడ్నాల నరేశ్, రమేశ్, రవికిరణ్, అన్వేష్, ఇంద్రనీల్, టీబీ కోఆర్డినేటర్ హరీశ్, సూపర్‌వైజర్ ఇమ్రాన్, మల్లికార్జున్, ఆంజనేయులు, రియాజ్, సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను రక్షించాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: వేసవికాలంలో ఎండలు ఉధృతం అవుతుండటంతో నాటిన మొక్కలను రక్షించాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం రాయికల్ మండలంలోని ఆలూరు, రాజనగర్ గ్రామాల్లో పారిశుధ్యం, నర్సరీ పనులు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు.

చురుకుగా కోనాపూర్ వంతెన నిర్మాణ పనులు


కోనాపూర్ వద్ద పాత వంతెన తొలగించే పనులు

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ వద్ద రూ.5.65 కోట్లతో నిర్మిస్తున్న వంతెన పనులు చురుకుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లా వెళ్లే ఈ రహదారిపై కోనాపూర్ వాగుపై గతంలో ఏర్పాటు చేసిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పాత వంతెన లోలెవల్ వంతెన కావడంతో వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదలతో వంతెనపై నుంచి నీరు పొంగిపొర్లేది. దీంతో రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పాత వంతెనను తొలగించి హైలెవల్ వంతెన నిర్మించాలని ఆర్అండ్‌బీ శాఖ ప్రతిపాదించింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో గత నెల చివరి వారంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి.

భవన నిర్మాణానికి భూమిపూజ

ధర్మపురి: మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం యాదవ సంఘం నూతన భవనానికి ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో మంజూరైన సీడీఎఫ్ నిధులతో భవన నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సర్పంచ్ రూపు సత్తమ్మ, ఉపసర్పంచ్ కూరగాయల సంతోష్, యాదవ సంఘం అధ్యక్షుడు రేణు మొండయ్య ఉన్నారు.

గీతకార్మిక సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్

కథలాపూర్: గీతకార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా కథలాపూర్‌కు చెందిన బొంగు నడ్పి సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం కథలాపూర్‌లో గీతకార్మిక సంఘం మండల సభ్యులు సమావేశమయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్యాపురం రవీందర్‌గౌడ్(కలిగోట), ప్రధాన కార్యదర్శిగా ముస్కెం లక్ష్మణ్(పోతారం), కోశాధికారిగా సుద్దాల సతీశ్(దుంపేట), కార్యదర్శిగా వెంకటేశ్, జిల్లా సభ్యుడిగా లింగంగౌడ్ ఎన్నికయ్యారు.